
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 1 సెప్టెంబరు 2024





స్వామివారి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు





జిల్లేడుబండ రిజర్వాయర్ వద్ద జరిగిన పనులు

ఎన్నాళ్లీ పరిహాసం..!

పరిహారం కోసం 'జిల్లేడుబండ' రైతుల నిరీక్షణ

డబ్బులివ్వకనే జలాశయం పనులు ప్రారంభం

2500 ఎకరాలు కోల్పోయిన అన్నదాతలు

కూటమి ప్రభుత్వమైనా న్యాయం చేయాలని వేడుకోలు



జిల్లేడుబండ రిజర్వాయర్

ముదిగుబ్బ, ఆగస్టు 31: ప్రాజెక్టు పనులు ప్రారంభమై సంవత్సరాలు గడిచినా పరిహారం ప్రకటించలేదు. దీంతో జీవనాధారమైన భూములు కోల్పోయి, పరిహారం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లేడుబండ జలాశయ నిర్మాణ పనులను నాలుగేళ్ల కిందట ప్రారంభించారు. ఇందుకోసం ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల్లో రైతుల నుంచి 2500 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 700ఎకరాలు ముంపు జలాశయానికి కేటాయించగా మిగిలిన 1800 ఎకరాలు ముంపు కింద కోల్పోతున్నారు. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం బాధితులకు ఎటువంటి పరిహారం ప్రకటించలేదు.

అర టీఎంసీ నుంచి 2.41కి పెంపు

ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లి తండా గ్రామ సమీపాన జిల్లేడు బండ రిజర్వాయర్ నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం మొదలుపెట్టింది. 2020సెప్టెంబరు 22న రూ.680కోట్ల నిధులు మంజూరు చేసింది. హంద్రీ నీవా కాలువ ద్వారా జలాశయానికి కృష్ణా జలాలు ఇవ్వనున్నారు. ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని పలు మండలాలకు సాగునీరు అందించాలని ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 700ఎకరాల్లో జిల్లేడు బండ రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులు సాగుతున్నాయి. తొలుత అర టీఎంసీ ఉన్న సామర్థ్యాన్ని 2.41టీఎంసీలకు పెంచాలని నిర్ణయించారు.

పరిహారం ఊసేది?

జిల్లేడుబండ రిజర్వాయర్ ముంపు బాధితులకు పరిహారం అందజేయడం లో గత వైసీపీ ప్రభుత్వం, అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. జలాశయ నిర్మాణ పనులు చేపట్టాలంటే ముందుగా ఎంత భూమి అవసరం అవుతుంది. ఎంత ముంపు కింద పోతుందన్న వాటిని యంత్రాంగం పరిశీలించి, రైతులకు న్యాయం చేయాల్సి ఉంటుంది. ఎకరానికి ఎంత పరిహారం ఇవ్వాలన్న దానిపై స్పష్టత ఇచ్చి రైతల అంగీకారం తీసుకున్న తరువాతే పనులు మొదలుపెట్టాలి. అయితే ధర్మవరం, పుట్టపర్తి అప్పటి ఎమ్మెల్యేలు రైతులకు జిల్లేడుబండపై గొప్పలు చెప్పారే తప్ప, ముంపు బాధితులకు ఎంత పరిహారం ఇస్తారో చెప్పలేదు. గ్రామ సభలు నిర్వహించ కుండానే గత వైసీపీ ప్రభుత్వం నేరుగా రిజర్వాయర్ నిర్మాణం పనులు చేపట్టింది. ఇప్పటికే దాదాపు 40 శాతం పనులు కూడా పూర్తయ్యాయని, రూ.180కోట్ల బిల్లులు కాంట్రాక్టర్‌కు మంజూరు కాకపోవడంతో గత నవంబరులో పనులు ఆపేశారు. వైసీపీ ప్రభుత్వం ముంపు రైతులకు పరిహారం అందించకుండా రైతులను మోసం చేసిందని, ఇప్పటి కూటమి ప్రభుత్వమైనా న్యాయమైన నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతాలివే...

బుక్కపట్నం, ముదిగుబ్బ మండలాల్లోని ఐదు రెవెన్యూ గ్రామాల పరిధిలో భూములు మునిగిపోనున్నాయి. రామసాగరం పూర్తిగా మునగనుంది. గోపాలపురం గ్రామ సమీపం వరకు మునిగే పరిస్థితి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. పొడరాళ్ళపల్లి, చాగాపురం, మంగళమడక గ్రామ పొలాలు మునుగుతాయి. మరికొన్ని గ్రామాల పరిధిలో మరో 300ఎకరాలు ముంపు బారిన పడనున్నాయి. రైతులు రూ.లక్షలు వెచ్చించి, సాగుచేసిన మామిడి, జామ, చీనీ తదితర పండ్ల తోటలను కోల్పోవాల్సి వస్తోంది. దీంతో కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. ఎకరాకు రూ25లక్షలైనా పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం అందించాలి



జిల్లేడుబండ రిజర్వాయర్ కింద నా భూమి 12ఎకరాలు ముంపునకు గురి అవుతోంది. వేరుశనగ, ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేవాళ్లం. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లేడుబండ ముంపు రైతులకు పరిహారం అందించకుండా డ్యామ్ పనులు మొదలుపెట్టారు. ఇప్పటి కూటమి ప్రభుత్వమైనా రైతులకు న్యాయమైన పరిహారాన్ని అందించాలి.

- గుర్రం కరుణాకర్, రైతు, పొడరాళ్ళపల్లి

వ్యవసాయమే ఆధారం



మాకు వ్యవసాయమే జీవనాధారం. జిల్లేడుబండ డ్యాం కింద మా భూమి దాదాపు 20ఎకరాల దాకా పోతోంది. వేరుశనగ, టమోటా పంటలు సాగు చేసేవాళ్లం. మామిడి చెట్లు, మూడు బోర్లు అన్ని నష్టపోతున్నాం. పంటలు పెట్టలేక వేరే పనులు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాం.

- నరేష్, రైతు, పొడరాళ్ళపల్లి

ఆదుకోవాలి..



జిల్లేడుబండ రిజర్వాయర్ ముంపు కింద నా భూమి 8 ఎకరాలు పోతోంది. ఎంత పరిహారం ఇస్తారు? ఎప్పుడు ఇస్తారు? అని చెప్పే నాథుడే లేడు. గత వైసీపీ ఎమ్మెల్యేలు జిల్లేడుబండ గొప్పతనం చెప్పారు తప్ప పరిహారం ఎంత ఇస్తారో చెప్పలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని అనుకుంటున్నాం.

- వెంకటనారాయణ, రైతు,పొడరాళ్ళపల్లి

ఖాద్రీశా.. కరుణించు !

కదిరి, ఆగస్టు 31: శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు. దీంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ధ్వంజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తులకు ఇబ్బందిలేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆంజనేయా.. అనుగ్రహించు !

నల్లచెరువు, ఆగస్టు 31: మండలంలోని పాలపాటి దిన్నె అంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసంలో చివరి శనివారం పూజలు ఘనంగా జరిగాయి. భక్తులతో ఆలయ ఆవరణం కిటకిటలాడింది. అదనంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు సైతం భక్తులతో నిండిపోయాయి. ఆలయ ఆవరణలో కోలాటలు, చెక్కభజనలు, భజనలు భక్తులను అలరించారు. గర్భగుడి చుట్టూ స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అన్నదాన కార్యక్రమానికి కర్ణాటక భక్తులు రామనాథ్, వనజమ్మ 50 ప్యాకెట్లు బియ్యం ఇచ్చినట్లు ఈఓ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ: కలెక్టర్



పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్

కొత్తచెరువు, ఆగస్టు 31: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బుక్కపట్నం రహదారిలో పింఛన్ల పంపిణీ కార్యక్ర మాన్ని ఆయన శనివారం పరిశీలించారు. లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం కావడంతో 31నే లబ్ధిదారులకు పింఛన్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందుకే ఒక రోజు ముందుగానే పింఛన్ అంద జేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 2,70,853 పింఛన్ లబ్ధిదారులుండగా వారికి ప్రతినెల రూ.116.19 కోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఒక్కరోజులోనే జిల్లావ్యాప్తంగా 98శాతం మందికి పింఛన్ పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన వారికి కూడా సోమవారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ..!

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వైసీపీ నాయకుడు

నేలకోట తండా చెరువులో దోపిడీ



ట్రాక్టర్‌లోకి ఇసుకను నింపుతున్న ఎక్స్‌కవేటర్

ధర్మవరం రూరల్, ఆగస్టు 31: మండలంలోని నేలకోటతండా చెరువులో ఓ వైసీపీ నాయకుడు యథేచ్ఛగా ఇసుకను తవ్వేస్తున్నాడు. ఎక్స్‌కవేటర్ల సాయంతో తవ్వుతూ ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇంత దర్జాగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మరింత రెచ్చిపోయిన అక్రమార్కుడు గత రెండు రోజులుగా చెరువులో మరింతగా తవ్వకాలు సాగిస్తున్నట్లు గ్రామస్థులు మండిపడుతున్నారు. సుమారు 50 ట్రాక్టర్ల ద్వారా శనివారం ఇసుకను డంప్ చేయించాడు. దాన్ని రాత్రివేళ ధర్మవరం, ముదిగుబ్బ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ధర రూ.3వేల నుంచి 4వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. రూరల్ పోలీసులకు ఈ విషయం తెలిపితే వారు మాముళ్లు పుచ్చుకుని మిన్నకుండిపోతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తరలించే వీడియోను గ్రామస్థులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అయినా అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి చెరువును కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్



గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 31: విధి నిర్వహణలో హోంగార్డులు అప్రమత్తంగా ఉండాలని హోంగార్డు రాయలసీమ రీజనల్ కమాండెంట్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శిరసాని పోలీస్ పరేడ్ మైదానంలో శనివారం నిర్వహించిన పరేడ్‌ను ఆయన పరిశీలించి హోంగార్డులతో గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ హోంగార్డులు పోలీసుశాఖతో పాటు పలు ప్రభుత్వశాఖలలో విధులు నిర్వర్తిస్తూ పోలీసు శాఖతో పాటు ప్రశంసలు అందుకుంటున్నారన్నారు. ఏదైనా సమస్య వచ్చినపుడు వెంటనే సబ్‌డివిజన్ హోంగార్డు ఇన్చార్జిలకు గాని, రిజర్వు ఇన్‌స్పెక్టర్‌కు గాని ఆర్‌ఐల ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేయాల న్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి తరచూ వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. హోంగార్డు సంక్షేమానికి చేపట్టిన చర్యలను వివరించారు. హోంగార్డుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని కమాండెంట్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీస్పీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు చంద్రశేఖర్ ఆర్ ఎస్సైలు పాల్గొన్నారు.



వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న మంత్రి సవిత



విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న మంత్రి సవిత

పరిగి ప్రజల వల్లే పదవి

మంత్రి సవిత

హిందూపురం(పరిగి), ఆగస్టు 31: పరిగి మండల ప్రజలు ఇచ్చిన మెజార్టీ వల్లే తనకు మంత్రి పదవి దక్కిందని బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శనివారం ఆమె పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో తనకు అత్యధిక మెజార్టీ రావడంతోనే మంత్రిగా అవకాశం వచ్చిందని, ఆ భారీ మెజార్టీకి ప్రధాన కారణం పరిగి మండల ప్రజలేనన్నారు. అధికారంలోకి ప్రభుత్వం వచ్చిన మొదటినెలలోనే వృద్ధులు, వితంతువులకు రూ.3వేల నుంచి రూ.4వేలకు, వికలాంగులకు రూ.3వేల నుంచి రూ.6వేలు, డీఎంహెచ్‌ఓ పింఛన్లు రూ.5వేల నుంచి రూ.15వేలుకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని కొనియాడారు. ఈనెల 1న ఆదివారం కావడంతో ప్రజా సమస్యలు దృష్టిలో ఉంచుకుని ఒకరోజు ముందే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు వచ్చినట్లు ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా 8520మంది పింఛన్‌దారులకు రూ.3,62,09,950లు వచ్చినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని సీతారాంపురం కాలనీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మొక్కలునాటి ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పరిపూర్ణ మహా అవతారి



పుట్టపర్తి, ఆగస్టు 31: బాలవికాస్ చిన్నారులు సంగీత నృత్యంతో భక్తులను అలరింప జేశారు. శ్రీసత్యసాయి జిల్లా సేవా సంస్థలు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ నందు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించా యి. బాలవికాస్ చిన్నారులు పరిపూర్ణ మహా అవతారి పేరిట సంగీత నృత్యంతో భక్తులను తన్మయపరిచారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. పర్తి యాత్ర పేరిట జిల్లా నలమూల నుంచి మూడు వేల మంది సేవా దళ్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు



95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

పుట్టపర్తి, ఆగస్టు 31: జిల్లాలో శనివారం రాత్రి 7 గంటలకు 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాలో 2,68,079 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, రూ. 115 కోట్ల పంపిణీ చేయాల్సి ఉంది. అయితే రాత్రి 7 గంటలకే 2,53,135 మందికి రూ. 108.63 కోట్లు పంపిణీ చేసి 95 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు పీడీ వెల్లడించారు.

WALK-IN-INTERVIEW

Wanted **Land Surveyors, AutoCAD Designers** and **Land Acquisition Executives** with 3 to 5 years' experience in **Wind and Solar Projects** for a reputed Organization in **Renewable Energy Industry.** Candidates must have knowledge in land survey, land mapping and land acquisition.

Minimum Qualification : ITI / Diploma or Any Graduation

Those who qualify, can walk-in for an interview

Venue : HOTEL PASUPALA INN GOOTY ROAD, ANANTAPUR

Date : 3rd September 2024 from 09.00 am to 01.00 pm.

Cell : 9059633320

Mail: peopleforemployment@gmail.com

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్



పుట్టపర్తి, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. ఆయన శనివారం తన చాంబర్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. అల్పపీడనం రాత్రికి తీరం దాటుతుందని, దీంతో భారీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా మండల నోడల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. నోడల్ అధికారులు మూడు రోజుల పాటు ఆయా మండల కేంద్రాల్లో పరిస్థితిని పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 31: జిల్లావ్యాప్తంగా శుక్రవారం రాత్రి తేలికపాటి వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. బత్తలపల్లిలో అత్యధికంగా 15.2 మిమీలు, అత్యల్పంగా నల్లచెరువులో 2.0 మి.మీ. వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు. అమరాపురం 14.0 మి.మీ., పెనుకొండ 13.0, అమడగూరు 9.6, తాడిమర్రి 7.8, రామగిరి 7.6, అగళి 6.8, గుడిబండ 6.2, పుట్టపర్తి 6.2, ఎన్పీకుంట 6.0, కదిరి 5.2, ఓబుళదేవరచెరువు 4.2, మడకశిర 3.6, లేపాక్షి 3.4, ముదిగుబ్బ 3.2, కొత్తచెరువు 2.4, తలుపుల 2.2, తనకల్లు 2.2, గాండ్లపెంట 2.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

సంస్మరణ సభ



జననం : 04-04-1962

మరణం : 16-08-2024

కీ॥శే॥ శ్రీ నాపా వీరాంజనేయులు గారు
టిడిపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు

ప్రేమ, అనురాగ, ఆప్యాయతలను మాకు పంచి, మా అభివృద్ధికి కారకులైన మా మార్గదర్శి కీ॥శే॥ నాపా వీరాంజనేయులు గారు మమ్మల్ని వీడి 15 రోజులు గడిచినా మీరు మాతోనే ఉన్నట్లుంది. మీరు మా నుంచి దూరమైనా మీ ఆశయసాధనకు కృషి చేస్తూ.. మీరు చూపిన మార్గంలో పయనిస్తాం.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని శోకతప్త హృదయాలతో మిమ్మల్ని స్మరించుకుంటూ... మీ...

భార్య : నాపా నాగమణి

కుమారుడు: నాపా జగదీష్ — కోడలు: నాపా మాధవీలత

కుమార్తె: పెద్దినేని రాధ — అల్లుడు: పెద్దినేని అశోక్

మనవరాళ్లు: లేఖ్య, భావిక, ఆద్య, అలయ

నాపా కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు

గమనిక : ఈ రోజు తేది.01-09-2024 ఆదివారం ఉదయం 10 గంటలకు జి.ఆర్.ఫంక్షన్ హాల్ (గేట్ 1) 3వ రోడ్డు, అనంతపురం. సంస్మరణ సభ జరుగును. సెల్ : 9886998065.

సమయాభావం లేనందున అందరినీ ఆహ్వానించలేకపోతున్నాం ఇదే మా ఆహ్వానంగా భావించగలరు

విదేశీ భాషలతో మెండైన ఉపాధి

ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత



విదేశీ భాషా కోర్సుల ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ అనిత

అనంతపురం సెంట్రల్/క్లాక్‌టవర్, ఆగస్టు 31: విదేశీ భాషలు నేర్చుకున్న విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు, సీఈ డాక్టర్ లోకేశ్‌తో కలిసి శనివారం ఆమె పీజీ డిప్లొమా ఫారిన్ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఎస్కేయూ, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో విదేశీ భాషల్లో పీజీ డిప్లొమా కోర్సులు అందిస్తున్నామన్నారు. ఇందులో స్పానిష్ 20, ఫ్రెంచ్ 19, జర్మన్ 20 సీట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఒక సంవత్సరం కాలవ్యవధిలో ఈ భాషా కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ప్రవేశాలు పొందేందు కు జిల్లాలోని నిరుపేద విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఈ కోర్సులు అభ్యసించిన విద్యార్థులు విదేశీ పర్యాటకులకు గైడ్‌గా పని చేయవచ్చునన్నారు. సకాలంలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు జారీచేయడంలో పరీక్షల విభాగం అధికారులు, సిబ్బంది కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్ర మంలో ప్రొఫెసర్లు నరసింహన్, నాగభూషణం రాజు, సూపరింటెండెంట్ చంద్ర, ఆర్డీటీ ప్రిన్సిపాల్ గీతాంజలి, కో-ఆర్డినేటర్ జోనస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌తో జాగ్రత్త: ఎస్ఈ

అనంతపురంరూరల్, ఆగస్టు 31: వర్షాలు కురుస్తున్న క్రమంలో ప్రజలు విద్యుత్ ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ సూచించారు. ముఖ్యంగా రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. తడిసిన చేతులతో వ్యవసాయ మోటార్లుగానీ స్టార్టర్లు గానీ పట్టుకోవద్దన్నారు. తడిసిన కరెంట్ స్తంభాలు, విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడిచిన చేతులతో తాకొద్దన్నారు. విద్యుత్‌కు సంబంధించిన ఏ వస్తువులను తడిచేతులతో తాకవద్దన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి ఉండటం, తాకేంత ఎత్తులో విద్యుత్ లైన్లు ఉన్నా వాటిని తాకవద్దన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. వర్షం పడుతున్న సందర్భంలో టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్‌ల స్విచ్‌లను ఆఫ్ చేసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ల కింద సెల్ ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమన్నారు. సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేయొద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలుంటే స్థానిక విద్యుత్ అధికారులు, లైన్‌మెన్, దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అలాగే 1912 టోల్ ఫ్రీ నెంబరుకు సమస్యలను తెలియజేయవచ్చునన్నారు.

రండి బాబూ రండి!

సెంట్రల్ యూనివర్సిటీలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్/బుక్కరాయసముద్రం, ఆగస్టు 31: సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణ అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏలో పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్, బీఎస్సీలో ఎకనామిక్స్, రిటైల్ మేనేజ్‌మెంట్ అండ్ ఐటీ, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బీబీఏ, బీకామ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. వీటిలో చేరేందుకు ఇంటర్మీడియేట్ పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సెప్టెంబరు 6లోపు admissions 2024@cuap.edu.in మెయిల్ ఐడికి మార్కుల జాబితా, రిజర్వేషన్ సర్టిఫికెట్స్‌తోపాటు అడ్మిషన్ కావాలనే కోర్సుల పేరుతో దరఖాస్తు పంపాలని సూచించారు. వివరాలకు https://cuap.ac.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

95.51 టీఎంసీలకు చేరిన నిల్వలు



కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

బళ్లారి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు భారీగా కురుస్తుండటం వల్ల డ్యాంకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంది. విద్యుదుత్పత్తి ద్వారా 5000 క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నారు. డ్యాం నీటి నిల్వలు శనివారం రాత్రికి 95.519 టీఎంసీలకు చేరాయి. ఇన్‌ఫ్లో 38,759 క్యూసెక్కులు కాగా, మొత్తం ఔట్ ఫ్లో 10,067 క్యూసెక్కులు. ఆగస్టు 10న డ్యాం క్రస్ట్ గేటు కొట్టుకుపోవడంతో, ఆ స్థానంలో కొత్తగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమర్చిన విషయం విదితమే. క్రస్ట్ గేటు కొట్టుకుపోయిన సమయంలో వరద నీటితో పాటు డ్యాంలో 30 టీఎంసీల నీరు నదికి మళ్లించారు. దీంతో ఆయకట్టుకు సాగు నీరు రావేమోనని రైతులు ఆందోళన చెందారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.7 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 95 టీఎంసీలు దాటింది.

జీడిపల్లి నుంచి కృష్ణా జలాలు విడుదల



కాలువలో కృష్ణా జలాల ప్రవాహం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31: జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ప్రధాన కాలువకు 200 క్యూసెక్కుల కృష్ణా జలాలను శనివారం విడుదల చేశారు. అర్ధరాత్రి నుంచి మరో 200 క్యూసెక్కులు పెంచి మొత్తం 400క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్, ఈఈ రాజా స్వరూప్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే దండోరా వేయించి కాలువ సమీపంలోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని వారు తెలిపారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ, డీఎస్పీకి సైతం సమాచారం అందించామన్నారు. జీడిపల్లి మరువ నుంచి వెళ్లే కృష్ణా జలాలు పీఏబీఆర్‌కు చేరుతాయన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ 304 కిలోమీటరు దగ్గర కుడివైపునకు మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి గొల్లపల్లి రిజర్వాయర్‌కు చేరుతాయన్నారు. అదే హంద్రీనీవా 400కేఎం దగ్గర పుంగనూరు బ్రాంచ్ కెనాల్ మీదుగా 25కిలోమీటరు దగ్గర చెర్లోపల్లి రిజర్వాయర్‌కు వెళ్తాయన్నారు. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు నీళ్లు వెళ్తాయని వారు తెలిపారు.

పలువురు సీఐల బదిలీ

అనంతపురం క్రైం, ఆగస్టు 31: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో కొందరు సీఐలను బదిలీ చేశారు. అదే క్రమంలో కొందరిని వీఆర్‌కు పంపారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఏపీ మస్తాన్	ఎస్సీ, ఎస్టీ సెల్	గుంతకల్లు టూటౌన్
పి.గణేష్	గుంతకల్లు టూటౌన్	వీఆర్,ఎస్పీ,ఏటీపీ
వి.యుగంధర్	వీఆర్ ఎస్పీ, శ్రీసత్యసాయి	పామిడి యూపీఎస్
రాజశేఖరరెడ్డి	పామిడి యూపీఎస్	వీఆర్,ఎస్పీ,ఏటీపీ
కె.రామసుబ్బయ్య	వీఆర్, ఎస్పీ, అనంతపురం	యాడికి సర్కిల్
జయజయనాయక్	వీఆర్, ఎస్పీ, తిరుపతి	రాయదుర్గం
శ్రీనివాసులు	రాయదుర్గం	వీఆర్, ఎస్పీ, ఏటీపీ
నరేంద్రరెడ్డి	వీఆర్, ఎస్పీ, ఏటీపీ	నల్లమాడ సర్కిల్
శ్రీధర్	బీకే సముద్రం యూపీఎస్	రామగిరి సర్కిల్
శివ ఆంజనేయులు	రామగిరి సర్కిల్	వీఆర్, శ్రీ సత్యసాయి

పండుగ వస్తోంది!

- అనంతలో 5 నుంచి దులీప్ ట్రోఫీ నిర్వహణ
- రేపు నగరానికి అంతర్జాతీయ క్రికెటర్ల రాక
- పాసుల కోసం ఎగబడ్డ అభిమానులు
- ఏర్పాట్లు పరిశీలించిన మాంచో ఫెర్రర్
- క్రికెట్ గ్రౌండ్‌లో అధునాతన పరికరాలు



పాసుల కోసం కిక్కిరిసిన క్రికెట్ అభిమానులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31: జిల్లా కేంద్రానికి క్రికెట్ పండగ వచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్న భారత ఆటగాళ్లు అనంతపురానికి క్రికెట్ ఆడటానికి వస్తున్నారు. ఈ నెల 5 నుంచి 22 వరకు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో దులీప్‌ట్రోఫీని నిర్వహించనున్నారు. ఆటగాళ్లు సోమవారం అనంతకు చేరుకుంటారు. 3, 4వతేదీలలో ఏసీజీలో ప్రాక్టీస్ కోసం ఏర్పాట్లు చేశారు. దీంతో ఇన్నాళ్లు టీవీల్లోనే అభిమాన ఆటగాళ్ల ఆట చూసిన జిల్లా ప్రజలు ప్రత్యక్షంగా వారిని చూసేందుకు ఎదురు చూస్తున్నారు. బీసీసీఐ, ఆంధ్రాక్రికెట్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే దులీప్‌ట్రోఫీకి సంబంధించిన పాసుల జారీ ప్రక్రియను శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామం (ఏఎస్‌వీ)లో నిర్వహించారు. దీంతో ఉదయం 5గంటలకే ఏఎస్‌వీకి చేరుకున్న యువత ఉదయం 11గంటల వరకు వేచి ఉన్నారు. మొదటి మ్యాచ్‌కు సంబంధించి నాలుగు రోజుల పాటు నిర్వహించే క్రమంలో నాలుగు రోజుకుగాను 8వేలు పాసులు జారీ చేశారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యువత పాసుల కోసం ఎగబడ్డారు. పోలీసులు, క్రికెట్ అభిమానుల మధ్య కాసేపు తోపులాట జరిగింది. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచోఫెర్రర్, ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆదిత్య, బీసీసీఐ క్యురేటర్ సమందర్‌సింగ్‌లు పాసుల జారీ, వర్షం కారణంగా పిచ్ పరిస్థితిని ఏసీజీలో పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లు జిల్లాకు వస్తుండటంతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్న పోలీసులకు సహకరించాలని అభిమానులను మాంచో ఫెర్రర్ కోరారు. జిల్లాలో దులీప్‌ట్రోఫీ నిర్వహణకు అవకాశం కల్పించినందుకు జిల్లా ప్రజల తరఫున బీసీసీఐ, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అధునాతన పరికరాల ఏర్పాటు

దులీప్‌ట్రోఫీ నిర్వహణకు సంబంధించి అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. బీసీసీఐ క్యురేటర్ సమందర్‌సింగ్ ఆధ్వర్యంలో పిచ్‌ను ఏర్పాటు చేశారు. వర్షం పడిన తరువాత నీటిని తక్కువ సమయంలో పీల్చే అధునాతన పరికరం సూపర్ సాపర్ యంత్రాన్ని రూ.30లక్షలు వెచ్చించి విశాఖపట్నం నుంచి తీసుకువచ్చారు. పిచ్‌ను చదును చేయడానికి ఆరు రోలర్లను అందుబాటులో ఉంచారు. సుమారు మూడెకరాల గ్రౌండ్‌ను అరగంటలో గడ్డిని తొలగించే గ్రాస్‌కట్టర్-3250ను అమెరికాలో రూ.60లక్షలకు కొనుగోలు చేసి తెప్పించారు. వర్షం వస్తే మైదానం మొత్తాన్ని కప్పి ఉంచేందుకు సుమారు 20కి పైగా కవర్లు అందుబాటులో ఉంచారు. స్టేడియంలో 4వేల మంది ప్రేక్షకుల సామర్థ్యాన్ని మరో వెయ్యికి పెంచేందుకు తాత్కాలిక సీట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రేక్షకులకు తాత్కాలిక మరుగుదొడ్లు, స్నాక్స్‌కు హోటల్ కౌంటర్లు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇక మునుపెన్నడూ లేని విధంగా మొదటిసారి ఏసీజీ నుంచి దులీప్‌ట్రోఫీ స్టార్‌స్పోర్ట్స్ నుంచి లైవ్ టెలికాస్ట్ చేసేందుకు భారీ టవర్ ఏర్పాటు చేశారు. వర్షం పడుతుండటం మూడు రోజుల పాటు వర్ష సూచనలు ఉండటంతో బీసీసీఐ ప్రతినిధులతో మాంచోఫెర్రర్ చర్చించారు. వాతావరణ పరిస్థితులను బీసీసీఐ హైకమిటీకి చేరవేసినట్లు తెలిపారు.



పాసుల కోసం క్యూలైన్‌లో యువతులు



అభిమానుల తోపులాటను అదుపు చేస్తున్న పోలీసులు



పాసులు జారీ చేస్తున్న సిబ్బంది

అందరూ సహకరించాలి

దులీప్ ట్రోఫీ నిర్వహణ సమీక్షలో కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31: అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఈనెల 5 నుంచి నిర్వహించే దులీప్‌ట్రోఫీ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కోరారు. ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో దులీప్‌ట్రోఫీ నిర్వహణపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల ఓఓ తొలిసారి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని సూచించారు. ఏసీజీకి నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయడానికి 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎస్ఈని ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం ఫైర్ సేఫ్టీ, డిజాస్టర్ రెస్పాన్స్ మెకానిజం పాటించాలన్నారు. క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో మంచి వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ పాకెట్లు, అంబులెన్స్‌లను అందుబాటు లో ఉంచాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులను సైతం వాడుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి టీంకు ఒక లైజన్ ఆఫీసర్‌ను నియమించాలన్నారు. క్రికెట్ పోటీలను తిలకించేందుకు రెండో మ్యాచ్ నుంచి విద్యార్థులను అనుమతిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పోలీసుశాఖకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ మేనేజర్ ఆదిత్యవర్మ, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఆర్డీఓలు వసంతబాబు, శ్రీనివాసులు రెడ్డి, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, మీడియా మేనేజర్ రాజ్‌గోపాల్, ఏసీఏ కోచ్ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్



టోల్‌ప్లాజావద్ద అడ్డుగా నిలిపిన లారీలు



యజమానులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

అధిక వసూళ్లపై ఆగ్రహం

టోల్‌ప్లాజా వద్ద లారీ యజమానుల ధర్నా

మంత్రి చొరవతో సమస్యకు పరిష్కారం

లేపాక్షి, ఆగస్టు 31 : టోల్ ప్లాజా వద్ద అధిక రుసుము వసూలు చేస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం లేపాక్షి మండలం చోళసముద్రం వద్ద ఉన్న టోల్‌ప్లాజావద్ద వాహనాలను అడ్డంగా నిలిపి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో లోడ్‌తో వెళ్తున్న లారీకి రూ.100, ఖాళీలారీకి రూ.50 వసూలు చేసేవారని, వారం రోజులుగా ప్రతి వాహనంపై రూ. 25 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. రహదారికి అడ్డంగా వాహనాలను ఆపి ధర్నా నిర్వహించారు. ఇదే సమయంలో బీసీ వెల్ఫేర్, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అటుగా వచ్చారు. లారీలను అడ్డంగా ఉంచడంతో ఆమె ఆరా తీశారు. టీడీపీ మైనార్టీ నాయకులు షేక్షావలి, వాహన యజమానులు సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి కలగజేసుకుని బోర్డు వేయకుండా అధికంగా రుసుము ఎలా వసూలు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వాహనదారులకు రుసుములో మినహాయింపు ఇవ్వాలని టోల్ సిబ్బందికి సూచించారు. మరో సారి అధిక వసూళ్లు చేయరాదని ఆదేశించారు. మంత్రి హామీతో లారీ యజమానులు ధర్నా విరమించారు.

మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీ జిల్లాగా అనంత: ఎస్సీ వెల్ఫేర్ డీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 31: మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీ జిల్లాగా అనంతను జిల్లా కలెక్టర్ ప్రకటించినట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, ప్రభుత్వాదేశాల మేరకు జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటరీ లెట్రిన్స్ వివరాలపై సర్వే చేశామన్నారు. అయితే జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటరీ లెట్రిన్స్ లేవని అన్ని పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాలకు నివేదికలు వచ్చాయన్నారు. అందులో భాగంగా కలెక్టర్ జిల్లాను మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీగా ప్రకటించారన్నారు. అభ్యంతరాలు ఉంటే 11వ తేదీలోపు సంబంధిత మున్సిపల్, మండల ప్రజాపరిషత్ అధికారుల ద్వారా వివరాలను ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయానికి పంపాలన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు31: అంబేడ్కర్ గురుకులాల్లో 6, 7, 8 తరగతులకు కేటాయించిన అదనపు సీట్ల దరఖాస్తులకు సంబంధించి 3వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఇదివరకు ఆగస్టు 30, 31వ తేదీలు గడువు విధించగా... తల్లిదండ్రుల నుంచి వచ్చిన వినతుల మేరకు 3 వరకు పొడిగించినట్లు తెలిపారు. అలాగే సెప్టెంబరు 1వ తేదీ నిర్వహించాల్సిన ప్రవేశపరీక్షను 4వ తేదీ నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షలో ముందు తరగతి సిలబస్‌లో 50 మార్కులకు ఉంటుందన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా సుబ్రహ్మణ్యం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 31: మైనార్టీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇవరకు ఈడీగా విధులు నిర్వహిస్తున్న మధుసూదన్ తన ఫారిన్ సర్వీసు కాలం ముగియడంతో... మదనపల్లిలోని సొం త శాఖ అడల్ట్ ఎడ్యుకేషన్‌గా వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఈడీగా సుబ్రహ్మణ్యంకు బాధ్యతలు అప్పగించారు.

కంది పంట పరిశీలన

విడపనకల్లు, ఆగస్టు 31: మండలంలోని విడపనకల్లు సరిహద్దు పొలాల్లో రైతులు సాగు చేసిన కంది పంట, వాటిలోని అంతర్ పంటలు కొర్ర, సజ్జలను అనంతపురం వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు మాధవిలతా, నారాయణస్వామి, నాగరాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కందికి సోకే వెర్రి తెగులు గురించి రైతులకు వివరించారు. ఇది వైరస్ తెగులు అని ఈ తెగులు సోకిన మొక్కలు లేత ఆకు పచ్చ రంగు గల చిన్న ఆకులను తొడుగుతుంది అన్నారు. దీని వల్ల పూత పూయదు, కాపు ఉండదు అన్నారు. ఈ తెగులు అసరియా కజాని అనే కంటికి కనిపించని ఇరియోపిడ్ నల్లి (మైట్స్) ద్వారా వ్యాపిస్తుంది అని తెలిపారు. ఇది వర్షాధారంతో పండించే భూముల్లో ఎక్కువగా సోకుతుందన్నారు. కంది విత్తిన 60 నుంచి 90 రోజుల్లో నల్లి నివారణకు లీటర్ నీటికి, 3 గ్రాముల గంధకం పొడిని నీటిలో కరిగేలా కలపాలి, లేదా ప్రొఫైర్గాట్ లీటరు నీటిలో 1-2మి.లీ కలిపి పది రోజలకు ఒక సారి మొక్కలపై పిచికారి చేయాలి అన్నారు. కందిలో సాగు చేసిన అంతర పంటలకు పైపాటుగా ఎకరాకు 15 కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. ఇలా చల్లుకోవడం వల్ల అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మజా, ఏఓ హెచ్ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని కోనాపురం, చిన్నముష్టూరు లత్తవరం గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం పంటలను ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు మాధవి, నారాయణస్వామి, నటరాజ్ శనివారం పరిశీలించారు. పంటలకు తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు.



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

రైతన్నా..! జాగ్రత్త

జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు



అనంతపురం అర్బన్, ఆగస్టు 31: రాబోవు రెండు, మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో ఉద్యాన పంటల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. టమోటా, అరటి, బొప్పాయి పంటల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అరటి పంటలో..

అరటిలో ముంపు నీరు ద్వారా వేరు వ్యవస్థ పాక్షికంగా లేదా పూర్తిగా దెబ్బతింటుంది. తద్వారా గెల తయారీ కోసం అవసరమైన నీరు, పోషక పదార్థాలు మొక్క తీసుకోలేదు. సాధ్యమైనంత త్వరగా పొలాల్లోని ముంపు నీటిని మురుగునీటి కాలువల ద్వారా బయటకు పంపాలి. ఆకులు, గెల బాగా తడిసే విధంగా లీటరు నీటికి ఐదు గ్రాములు సల్ఫేట్ ఆఫ్ పొటాష్, ఐదు గ్రాములు పొటాషియం నైట్రేట్ ఎరువులు మూడు రోజుల వ్యవధిలో మూడు సార్లు ఒకదాని తర్వాత మరొకటి పిచికారి చేయాలి. ఆ తర్వాత గెలలను ఎండిన అరటి ఆకులతో కప్పి ఉంచి పక్షం రోజుల్లో మార్కెట్ చేసుకోవాలి. వెదురు కర్రతో ఊతమిచ్చి మొక్కలు పడిపోకుండా చేసుకోవాలి. ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించి మరిన్ని మెలకువలు పాటించాలి.

బొప్పాయిలో..

అధిక వర్షానికి బొప్పాయిలో పండు ఈగ ఉధృతి పెరిగే అవకాశం ఉంది. నివారణ కోసం మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరాకు 10 నుంచి 15 ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలకు రాలిన కాయలను వెంటనే మార్కెట్‌కు తరలించాలి. అధిక వర్షాలకు నేల కోతకు గురై నేల సారం తగ్గుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సిఫార్సు చేసిన ఎరువులను 5-10 శాతం అధిక మోతాదులో వేసుకోవాలి. జింక్ సల్ఫేట్ రెండున్నర గ్రాములు లీటరు నీటికి , ఒక గ్రాము బోరాన్ లీటరు నీటికి, 10 గ్రాములు యూరియా ఒక లీటరు నీటికి కలిపి 20 రోజుల వ్యవధిలో పిచికారి చేసుకోవాలి. అధిక గాలుల నుంచి పంటను రక్షించేందుకు చుట్టూ దరి పంట వేసుకోవడంతోపాటు పడిపోయే అవకాశం ఉన్న చెట్లకు ఊతమివ్వాలి.

టమోటా పంటలో..

పొలంలో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలి. బోదెలు లేదా బెడ్లపై టమోటా నాటుకోవాలి. వర్షాలు ఆగిన వెంటనే 19-19-19 లేదా 13-0-45 లేదా యూరియా తదితర పోషకాలను పంటపై పిచికారి చేయాలి. అవసరమైతే సూక్ష్మ పోషకాలు పిచికారి చేసుకోవాలి. నేల కొంచెం ఆరిన తర్వాత రసాయన ఎరువులను వేసుకోవాలి. వర్షాలు ఆగిన తర్వాత అంతర సేద్యం చేసి కలుపు తొలగించుకోవాలి. పందిరిపై తీగజాతి కూరగాయలు సాగు చేసుకోవాలి.

మున్సిపల్ ఆర్డీ బదిలీ

అహుడా వైస్ చైర్మన్ కూడా..

అనంతపురం క్రైం, ఆగస్టు 31: మున్సిపల్ రీజనల్ డైరెక్టర్(ఆర్‌డీ) పీవీవీఎస్ మూర్తిని సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వనాథను నియమించారు. అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా) వైస్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్‌ను సీడీఎంఏ కార్యాలయంలో ఏడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647 AJA-198063

PLOT FOR SALE

గుత్తి-గుంతకల్ మధ్యన, నేషనల్ హైవేకి, నియర్ పాత కొత్తచెరువు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరియాలో, ఓపెన్ ప్లాట్లు కమర్షియల్ ప్లాట్లు & అమ్మకానికి కలవు. హైవేకి 100x100 feet ఫేసింగ్. స్పాట్ రిజిస్ట్రేషన్ కలదు. సంప్ర: 9449986123,9347039123. AJA-198057

36 లక్షలకే 2BHK

Atp to BKS దేవరకొండ దగ్గర మా నూతన వెంచర్ "శ్రీ పదం-హిల్‌వ్యూ" నందు 36 లక్షలకే 3 సెంట్లలో నిర్మిస్తున్న 2BHK ఇండిపెండెంట్ ఇల్లు. బుకింగ్ కొరకు సంప్రదించండి సెల్: 9515860608, 7396540409. AJA-175398

VILLA HOUSE FOR SALE

Atp to TDP హైవే రోడ్డుకు, BKS దాటాక, నూతన గేటెడ్ కమ్యూనిటీ నందు 4 సెంట్లలో నిర్మిస్తున్న 2BHK 55 లక్షలు & 3BHK డూప్లెక్స్ విల్లా 55 లక్షలు అమ్మబడును సంప్రదించండి సెల్: 9515860608, 7396540409. AJA-175397

TOURS AND TRAVELS

సాయికళ టూర్స్ & ట్రావెల్స్ మదనపల్లె సింగపూర్, మలేసియా 5N/6D, 90000/- కంటి 80000/- డిసెంబర్ 31 వరకు తేదీలు:3-10-24, 5-11-24, 26-11-24, 8-12-24&20-12-24 సెల్:9440359204 AJA-sathish

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న ఆంజనేయస్వామి

తనకల్లు, ఆగస్టు 31: మండలంలోని గండోడివారిపల్లి గ్రామ సమీపంలో నలకటువ వద్ద వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఏడాది క్రితం ఇక్కడ స్వామిని ప్రతిష్ఠించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

కృష్ణుడి ఊరేగింపు



ఓడీసీలో కృష్ణుడిని ఊరేగిస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 31: ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఉట్లవారిపల్లి సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో శనివారం కృష్ణుడి విగ్రహాన్ని మండల కేంద్రంలో ఘనంగా ఊరేగించారు. కృష్ణుడి నామస్మరణతో ఊరేగింపు సాగింది. కృష్ణుడి బోధనలను వివరించారు.

లక్ష్మీనరసింహస్వామి మడుగుభజన

బుక్కపట్నం, ఆగస్టు 31: మండలంలోని అగ్రహారం గ్రామంలో కొండల్లో వెలసిన అతి పురాతనమైన లక్ష్మీ నరసింహస్వామి మడుగు భజన కార్యక్రమాన్ని గ్రామస్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి యేటా శ్రావణమాసం నాలుగో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. గ్రామానికి చెందిన యువకులు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సీఎంను కలిసిన పుట్టపర్తి నాయకులు



సీఎం చంద్రబాబుకు సత్యసాయి చిత్రపటాన్ని అందజేస్తున్న బీసీ పుట్టపర్తి నాయకులు

పుట్టపర్తి, ఆగస్టు 31: రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని తెచ్చి బీసీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలిచారని టీడీపీ బీసీ సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ, కొట్టాల శ్రీరాములు పేర్కొన్నారు. వారు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి సత్యసాయి చిత్రపటాన్ని అందజేశారు. బీసీ చట్టాన్ని తీసుకొచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. పుట్టపర్తి సందర్శనకు రావాలని ఆహ్వానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేకరీ నాయుడు తదితరులు ఉన్నారు.

నల్లమాడ సీఐగా నరేంద్రరెడ్డి



బాధ్యతలు స్వీకరించిన సీఐ నరేంద్రరెడ్డి

నల్లమాడ , ఆగస్టు 31: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై నరేంద్రరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ బదిలీపై కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో పుట్టపర్తిలో వీఆర్‌లో ఉన్న నరేంద్రరెడ్డి మండల సీఐగా బాధ్యతలు చేపట్టారు. పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కదిరి అర్బన్, ఆగస్టు 31: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కదిరి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ మోహన్ పేర్కొన్నారు. మండలంలోని ఎరుకలవాండ్లపల్లి వద్దన్న హరీష్ పాఠశాలలో శనివారం విద్యార్థుల సమావేశం ఆయన మాట్లాడుతూ... చెడు అలవాట్లకు బానిసైతే బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నారని తెలిసినా, తరలిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్, ఏఎస్ఐ రామక్రిష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేసుకోండి

నల్లమాడ, ఆగస్టు 31: మండల వ్యాప్తంగా ఈ యేడు ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని ఎంఏ సుమతి తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ... రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈపంట న మోదు చేసుకున్న వారికే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నల్లమాడ, ఆగస్టు 31: మండలంలోని చారుపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని వంకరకుంట గ్రామానికి చెందిన రమణారెడ్డి (53) ద్విచక్రవాహనంలో తన తమ్ముడు చలమారెడ్డితో కలిసి నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి వెళ్లాడు. తిరిగి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికివస్తుండగా చారుపల్లి సమీపంలోని తొలుమాను గుట్ట మలుపు వద్ద రెడ్డిపల్లి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈప్రమాదంలో రమణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. దిచక్రవాహనంలో వెనుక పక్కన కూర్చున్న చలమారెడ్డి వెంటనే 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. చలమారెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసుల తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్, ఆగస్టు 31: మండలంలోని వెంకటతిమ్మాపురానికి చెందిన అక్కమ్మ విషద్రావకం తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు రూరల్ పోలీసులు తెలిపారు. వెంకటతిమ్మాపురానికి చెందిన వెంకటేష్ భార్య అక్కమ్మ ఇంట్లో ఎవరూ లేనిసమయంలో విషద్రావకం తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటినా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

ఇళ్ల వద్దే అందిస్తున్నాం : ఎమ్మెల్యే కందికుంట



నంబులపూలకుంటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

నంబులపూలకుంట, ఆగస్టు 31: అధికారులు, నాయకులు సమష్టిగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందిస్తున్నాని ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ పేర్కొన్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ప్రతినెల ఒకటో తేదీన పంపిణీ చేయాల్సిన పింఛన్లను శనివారం 31వ తేదీనే పంపిణీ చేశారు. మండలంకేంద్రంలోని పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. ఆయన లబ్ధిదారుల ఇళ్లవద్దకెళ్లి పింఛన్లు అందించారు. అనంతరం పీర్లచావిడి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... సమాజం, వ్యవస్థ, నాయకుల మీద గౌరవమున్న వ్యక్తి ముఖ్యమంత్రి అయితే పరిపాలన ఏవిధంగా ఉంటుందో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చూపుతున్నారని అన్నారు. మండ లంలో నెలకున్న సమస్యలను రెండు, మూడు నెలల్లో పరిష్కరిస్తా మన్నారు. శ్మశానవాటికకు ఉపాధి పథకం నిధులు మంజూరు చేయిస్తామన్నారు. సోలార్‌లో భూములు కోల్పోయి నేటికీ పరిహారం అందని రైతుల త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. త్వరలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామ న్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ మనోహర్ బాబు, తహసీల్దార్ నరేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్‌నాయుడు, ఏపీఓ చంద్రశేఖర్, సర్పంచ్ ఆంజనమ్మ, దండే రవి, శివారెడ్డి, గంగిరెడ్డి, ఆంజనప్పనాయుడు, నరసింహులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దొన్నికోటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర

నల్లమాడ / ఓబుళదేవరచెరువు: నల్లమాడ మండలంలోని ఎర్రవంకపల్లి, వేళ్లమద్ది, రెడ్డిపల్లి, నల్లశింగయ్యగారిపల్లి, దొన్నికోట, పులగంపల్లి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ మైలేశివశంకర్, నాయకులు కేశవరెడ్డి, వెంకటరమణనాయుడు, గంగులప్పనాయుడు, పెద్దప్పయ్యనాయుడు, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కులశేఖర్‌నాయుడు, రాజారెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఓబుళదేవరచెరువు మండలంలోని గాజుకుంటపల్లి, నారప్ప గారిపల్లి, వెంకటాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే, మాజీ మంత్రి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. సెప్టెంబరు 1వతేదీ ఆదివారం కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.

ముదిగుబ్బ: మండల వ్యాప్తంగా శనివారం తెల్లవారుజాము నుంచి మోస్తరులో వర్షం కురుస్తున్నా అధికారులు, టీడీపీ నా యకులు ఇంటింటికి వెళ్లి 95శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని నాయీబ్రాహ్మణ కాలనీలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, నాయకులు చంద్రసేన, రామ్మూర్తి, గాజుల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం: ఎన్టీఆర్ భరో పింఛన్ల పంపిణీలో శనివారం మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు పాల్గొన్నారు. బుక్కపట్నంలో రాష్ట్ర మైనార్టీ నాయకుడు సయ్యద్‌బాషా, వాజీద్ తదితరులున్నారు.



ముదిగుబ్బలో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



బుక్కపట్నంలో పంపిణీ చేస్తున్న దృశ్యం

మామూళ్లివ్వకపోతే పనిచేయరా..?

సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్యే



సబ్‌రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఆగస్టు 31: మామూళ్లు ఇవ్వకపోతే సామాన్య ప్రజల పనులు చేయరా అని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సబ్‌రిజిస్ట్రార్ శిరీషాను ప్రశ్నించారు. ఆయన శనివారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలను కార్యాలయ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడుతూ మామూళ్లు ఇవ్వకపోతే కార్యాలయంలో పనిచేయరా అని ప్రశ్నించారు. మీరు సరిగా పనిచేస్తే మీ కార్యాలయ సమస్యలు మా వరకు ఎందుకొస్తాయని మండిపడ్డారు. మీరు పని చేయనప్పుడే మావరకు సమస్యలు వస్తాయన్నారు. వారంరోజుల్లో పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యాలయంలో అవినీతి పెరిగి పోవడం వలన తమకు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇటువంటివి పునరావృతం కాకూడదని సూచించారు.

నూతన బస్సుల ప్రారంభం

కదిరి: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన రెండు కొత్త బస్సులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం ప్రారంభించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో వాటిని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈరెండు సర్వీసులు అనంతపురం నడుస్తాయన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనేక కొత్త బస్సులను ప్రారంభించినట్లు చెప్పారు. కదిరి డిపోనుంచి ఇప్పటికి పాత బస్సుల స్థానంలో కొత్తగా పది బస్సులు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచితబస్సు సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు అయ్యప్పసేవా సమితి సేవలు



అన్నదాన సేవలో పాల్గొన్న దృశ్యం

నల్లచెరువు, ఆగస్టు 31: ప్రసిద్ధి గాంచిన పాలపాటి దిన్నె ఆంజనేస్వామి ఆలయం ఆవరణంలో నాలుగు శ్రావణ శనివారాల్లో భక్తులకు కదిరి అయ్యప్పసేవా సమితి సభ్యులు 30 సేవలందించారు. వారికి ఆలయ ఈఓ రవీంద్రరాజు ధన్యావాదాలు తెలిపారు. ప్రతియేటా అన్నదానం ముగిసేవరకు సేవ చేస్తున్నట్లు వారు తెలిపారు .

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మల్లికార్జున

తనకల్లు, ఆగస్టు 31: బీసీల అభివృద్ధే తన ధ్యేయమని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన మల్లికార్జున పేర్కొన్నారు. ధర్మవరంలో శనివారం జరిగిన బీసీల సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయినిగా మారిన ఎమ్మెల్యే సింధూర



పాఠాలు చెబుతున్న ఎమ్మెల్యే

నల్లమాడ, ఆగస్టు 31: మండలంలోని దొన్నికోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పాఠ్యాంశాలు బోధించారు. ఆమె శనివారం పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా సైన్సు పాఠ్యాంశాలలోని జీర్ణవ్యవస్థ చిత్రాన్ని బ్లాక్ బోర్డుపై గీసి బోధించారు.

మున్సిపల్ కమిషనర్‌గా

మల్లికార్జున బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ మల్లికార్జున

ధర్మవరం, ఆగస్టు 31: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ రాంకుమార్‌ను రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్‌ఉత్తర్వులు జారీ చేశారు. వేకెన్సీ రిజర్వ్‌లో ఉన్న మల్లి కార్జున ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. కార్యాల య అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు టీడీపీ నాయకుల ధర్నా

ధర్మవరం, ఆగస్టు 31: ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున బాధ్యతలు స్వీకరించడంపట్ల టీడీపీ నాయకులు సోమవారం ధర్నాకు సిద్ధమ య్యారు. నాయకులు పరిశేసుధాకర్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్ నాయుడు, కొత్తపేట ఆది, సంధ్యారాఘవ, ఫణికుమార్, మాధవరెడ్డి తదితరులు శనివారం మున్సిపల్ కార్యాలయం వద్దకు అడ్డుకోవడానికి వెళ్లారు. అప్పటికే కమిషనర్ మల్లికార్జున కలెక్టర్‌ను కలవడానికి పుట్టపర్తికి వెళ్లారని తెలిపారు. కమిషనర్ వ్యవహారంపై టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరి టాల శ్రీరామ్ సీఎంకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ధర్మవరంలో కమిషనర్‌గా కొనసాగన్విమని ఇక్కడి నుంచి వెళ్లిపోయేవరకు పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాల యం ఎదుట ధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి: ఎంఈఐ

తాడిమర్రి, ఆగస్టు 31: వాహనదారులు ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఎంవీఐ వరప్రసాద్ తెలిపారు. శనివారం సాయంత్రం తాడిమర్రికి వచ్చిన ఆయన వాహనదారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని కోరారు. అతివేగంగా ప్రయాణించకుండా, కుటుంబసభ్యులను గుర్తించు కుని వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగాస్వామి పాల్గొన్నారు.

దోషులను అరెస్టు చేయాలి

- గొర్రెల కాపరి కుటుంబ సభ్యుల డిమాండ్
- రోడ్డుపై బైఠాయించి ఆందోళన



కూడలిలో ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు, కురుబ నాయకులు

కొత్తచెరువు, ఆగస్టు 31: మండలంలోని లింగారెడ్డిపల్లికి చెందిన గొర్రెల కాపరి శ్రీరాములు ఆత్మహత్యకు కారుకులను వెంటనే అరెస్టు చేయాలని మృతుడి భార్య భారతి, కుటుంబసభ్యులు, కురుబసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శ్రీరాములు ఆత్మహత్య చేసుకుని మూడురోజులు అవుతున్నా బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో పోలీసుల జాప్యం చేస్తున్నారంటూ వారు శనివారం మండలకేంద్రంలోని రోడ్ల కూడలిలో రోడ్డు పై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమకు న్యాయం చేయాలంటూ స్థానిక సీఐ ఇందిరకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఇప్పటి వరకు శ్రీరాములు హత్యకు కారణమైన కాంతమ్మ, నాగభూషణ, నరసింహుడు, నారాయణప్ప, ఆంజనేయులును అదుపులోకి తీసుకోకపోవడం ఏమిటని బందోబస్తుకు వచ్చిన పుట్టపర్తి సీఐ అశోక్ కుమార్‌ను ప్రశ్నించారు. తన సామాజిక వర్గం వారిని కాపాడాలన్న ఉద్దేశ్యంతోనే సీఐ ఇందిర ఇలా చేస్తున్నారని కురుబ సంఘం నాయకులు మండిపడ్డారు. తమకు న్యాయం చేయకపోతే పూడ్చిన శవాన్ని తీసుకొచ్చి ఎస్పీ కార్యాలయం ఎదుటే ధర్నా చేపడుతామన్నారు. ఇప్పటికైనా తన భర్త మృతికి కారకులైన వారిని అరెస్టు చేయకపోతే పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకుంటానని మృతుడి భార్య భారతి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగడానికి ప్రయత్నించగా పోలీసులు, బంధువులు అడ్డుకున్నారు. వారిని 24 గంటల్లోగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతామని సీఐ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



కొత్తచెరువులో మట్టి తింటూ నిరసన



ముదిగుబ్బలో మెడకు ఉరితాళ్లు తగిలించుకుని...

పదోరోజుకు చేరిన కార్మికుల నిరసన

కొత్తచెరువు, ఆగస్టు 31: మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సప్లై ప్లాంటు వద్ద సత్యసాయికార్మికులు చేపట్టిన నిరసన దీక్ష శనివా రం పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.... తమకు గౌరవ వేతనం ఆర్నెల్ల నుంచి అందించకపోవడంతో కుటుం బాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మట్టిని తింటూ నిరసన తెలిపారు. తాము 10 రోజుల నుంచి నిరసన తెలుపు తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, మంత్రులు స్పందించకపో వడం బాధాకరమన్నారు. లక్షలాదిమందికి దాహార్తిని తీరుస్తున్నామని, ఇప్పటికైన ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి ప్రాజెక్టుకు బకాయిలను వెంటనే విడుదల చేయించి ఆదుకోవాలని వారు కోరారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సత్యసాయి తాగునీటి పంపు హౌస్ వద్ద శనివారం సత్యసాయి కార్మికులు పదో రోజు సమ్మె కొనసా గించారు. మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలిపారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆంజనేయస్వామికి శ్రావణమాస పూజలు



అలంకరణలో ధర్మవరంలోని వీరాంజనేయస్వామి, మునగలవారిపల్లి గరుడాంజనేయస్వామి

ధర్మవరం, ఆగస్టు 31: పట్టణంలోని శివానగర్‌లోవెలసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి శ్రావణ మాస చివరి శనివారం పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. పూలు, తులసి తమలపాకులు, వడమాలతో అలంకరించారు.

గాండ్లపెంట: మండలంలోని బొలుగుట్టపల్లి, వేపరాల కురమామిడి, పాయకట్టు, మునగలవారిపల్లి, గాండ్లపెంట ఆలయాల్లో వెలసిన ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. మునగలవారిపల్లి గరుడాంజనే యస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామికి పూజలు చేయించారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- అమెరికా నుంచి మంత్రి సత్యకుమార్

ధర్మవరం, ఆగస్టు 31: ప్రజలందరూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలపట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరంలో పరిస్థితులను నిత్యం పర్యవేక్షిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ కార్యాలయ సిబ్బందికి ఆదేశించారు. తాను ఉన్నతాధికారులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పరిస్థితుల గురించి అప్రమత్తం చేస్తున్నానని, వ్యాధులు ప్రబలకుండా సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఏ చిన్న సమస్య తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు పరిష్కస్తారన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

కదిరి, ఆగస్టు 31: అమడగూరు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ వి. రత్న శనివారం ఆకస్మికం తనిఖీ చేశారు. రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సిబ్బంది వారి విధులకు సంబంధికి సూచనలు, సలహాలు ఇచ్చారు. సరిహద్దు చెక్‌పోస్టులో నిరంతరం నిఘా పెంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ వెంకటనారాయణ, సిబ్బంది ఉన్నారు.

పౌరహక్కులపై అవగాహన

అమడగూరు మండలంలోని మలకవారిపల్లి తండాలో పోలీసులు, రెవెన్యూ అధికారులు శనివారం పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రత్న మాట్లాడుతూ... సమాజంలో అణగారిన ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించారు. ఆ హక్కులు పటిష్టంగా అమలైయ్యేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ మునియప్ప, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సంస్కృతి విద్యాసంస్థల్లో సేల్స్‌ఫోర్సు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న సంస్కృతి ఇంజనీరింగ్ విద్యార్థులు

పుట్టపర్తి , ఆగస్టు 31: బెంగుళూరుకు చెందిన సేల్స్‌ఫోర్సు ట్రైల్ బ్లైజర్ కమ్యూనిటీ గ్రూప్, సంస్కృతిగ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మండలపరిధిలోని బీడుపల్లి సంస్కృతి స్కూల్‌ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. రాష్ట్రంలోనే మొట్టమొ దటి సారిగా నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాపును రెండురోజులు కొనసాగిస్తున్నట్లు గ్రూప్ హెడ్ శేషగిరి తలమల్ల తెలిపారు. త్వరలో ఆన్‌క్యాంపస్ ప్లేస్‌మెంటు డ్రైవ్ నిర్వహిస్తామని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సభ్యులు చైత్ర, అక్షయ వాసు, సురేష్ కొప్పునీడి, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు శ్రావణి, నెవగి, ఆర్‌వీ సహనా, సేల్స్ ఫోర్స్ డెవలపర్ ఓరియంటేషన్ ప్రోగ్రం నిర్వహించారు. రెండు రోజుల పాటు సాంకేతిక గురించి విద్యార్థులకు ఓరియంటేషన్ క్లాసులను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సంస్కృతి విద్యా సంస్థల చైర్మన్ విజయభాస్కరరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

బాలయ్య అభిమానుల సంబరాలు



ఎన్టీఆర్ విగ్రహం చేసి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

కొత్తచెరువు, ఆగస్టు 31: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేశారు. టీడీపీ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, రామకృష్ణ, ఒలిపిశీన, సైకిల్‌షాపుబాబా, కేశప్ప, చికెన్‌సెంటర్ వెంకటేశ్, హర్ష, కేశప్ప, ఆది,శివ, పెద్దన్న, సుబ్బాచారీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసమే సభ్యత్వ నమోదు: బీజేపీ

ముదిగుబ్బ, ఆగస్టు 31: రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నుంచి నిర్వహించనున్నట్టు బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్ పేర్కొన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలో పోలింగ్ బూత్ కన్వీనర్ల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు.

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఒరిగిన విద్యుత్ స్తంభం

బత్తలపల్లి, ఆగస్టు 31: మండలంలోని అనంతసాగరంలో గ్రామంలో విద్యార్థులను తరలించే ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఎవరికీ ఎటువంటి అపాయం కలుగలేదని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను తరలించే ఆర్టీసీ బస్సు విద్యార్థులను దింపేందుకు శనివారం సాయంత్రం మండలంలోని అనంతసాగరం గ్రామానికి వెళ్లింది. ఆ సమయంలో ఎస్టీకాలనీ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని పొరపాటున ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి బస్సుపై పడింది. విద్యుత్ సరఫరా కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తన సిబ్బందితో గ్రామానికి వెళ్లి స్తంభాన్ని తొలగించారు.

అవ్వాతాతల్లో ఆనందం

● ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ
● ఊరూరా పండుగ వాతావరణం


మెళవాయిలో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల


హిందూపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు, కమిషనర్


కొల్లకుంటలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప ..

హిందూపురం, ఆగస్టు 31: వృద్ధుల్లో ఆనందం వెల్లివిరిసింది. శనివారం ఉదయం నుంచే పింఛన్ పంపిణీ ప్రారంభించడంతో ఊరూరా పండగ వాతావరణం నెలకొంది. వృద్ధులకు భరోసా ఇవ్వడమే టీడీపీ ధ్యేయమని హిందూపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం హిందూపురం పట్టణంలోని పలువార్డుల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రవీంద్రనాయుడు, ఆంజనేయులు, రవిచంద్ర, కొట్నూరులో శేఖర్, అశ్వర్థ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. కొల్లకుంటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, శేఖర్, నాగభూషణం పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: పెనుకొండ పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం 92.36శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పోతిరెడ్డి, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మండలంలో 8,900 మందికి రూ.3.70 కోట్లు పంపిణీ చేశారు. ఒకే రోజు 92 శాతానికి పైగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మండలంలోని కదిరేపల్లి, మెళవాయి గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివామూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సోనియాబాయి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో జడ్పీటీసీ అనూష, టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, గౌరీశంకర్, నాగరాజుస్వామి తదితరులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. మొదటి రోజునే 95 శాతం వరకు పంపిణీ పూర్తయ్యిందని అధికారులు తెలిపారు.

గోరంట్ల: మండలంలోని 20 పంచాయతీల్లో 93.62శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసినట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త తెలిపారు. 11,481 పింఛన్లకు గాను సాయంత్రం 5గంటలవరకు 10,748 పింఛన్లు అందజేశామన్నారు.

అగళి : వృద్ధులకు, దివ్యాంగులకు అందజేసే పింఛన్ల కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని అగళి జడ్పీటీసీ ఉమేష్, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ రవిప్రసాద్ పేర్కొన్నారు. సాయంత్రానికి 93శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేశామన్నారు.

పెనుకొండ: నగరపంచాయతీలోని 20 వార్డుల్లో పట్టణ టీడీపీ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, త్రివేంద్రనాయుడు, నంజుండ, సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.

గుడిబండ: మండలంలోని 63గ్రామాలలో వృద్దులు, వికలాంగులు, వితంతువులకు 98శాతం ఎన్టీఆర్‌భరోసా పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు.

హిందూపురం(సోమందేపల్లి): మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ శనివారం అట్టహాసంగా ప్రారంభం అయింది. ఉదయం 6గంటల నుండి టీడీపీ జనసేన నాయకులు, అధికారులు 16పంచాయతీల్లో ఇళ్లవద్దకే వెళ్లి పెన్షన్లు అందజేశారు. తొలిరోజు దాదాపు 98శాతం పెన్షన్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

మడకశిర(అమరాపురం): మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లోనూ శనివారం ఉదయం 6 గంటలకే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. విరుపసముద్రం గ్రామంలోని పింఛనుదారులకు మండల కన్వీనర్ గణేష్ పింఛన్లను పంపిణీ చేశారు.

చంద్రబాబు మాట ఇచ్చారంటే అమలైనట్లే : ఎమ్మెల్యే

మడకశిరటౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు మాట ఇచ్చారంటే అమలైనట్లేనని ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చర్యలు తీసుకొంటున్నారని, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని చౌటిపల్లి, సదాశివపురం, తదితర కాలనీలలో పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా కమిషనర్ రంగస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తిపాల్గొన్నారు.


పెనుకొండలో..


గోరంట్లలో..


గుడిబండలో..


గోరంట్లలో



పెనుకొండలో.. దక్షిణముఖ ఆంజనేయుడు..


అగళిలో


గుడిబండలో..


పెనుకొండ కొండపై..

వాయుపుత్రా నమోనమః

● శ్రావణ శనివారం హనుమాన్ ఆలయాలకు భక్తుల తాకిడి
● ప్రత్యేకపూజలు, అర్చనలు

పెనుకొండ రూరల్, ఆగస్టు 31 : శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలతో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. మండలంలోని కొండాపురం వెళ్లే రహదారిలో కొండపై వెలసిన రాతిశిల ఆంజనేయస్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్త మండలి సభ్యులు అలివేలమ్మ, శ్రీనివాసులు అన్నదానం నిర్వహించారు.

గోరంట్ల : మండలంలోని కొండాపురం, బూదిలి, గౌనివారిపల్లి, కరావులపల్లితండా, పాలసముద్ర, మల్లాపల్లి, వానవోలు, గోరంట్ల తదితర గ్రామాల్లోని శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బూదిలిలో కాడిమాను ఆంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. పెద్ద చెరువు మరవ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ చేపట్టారు.

చిలమత్తూరు : కనుమ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అభిషేకాలు, అర్చనలతో స్వామి వారికి సేవలు అందించారు. కొడికొండ సమీపంలో వెలసిన భైలాంజినేయ స్వాయి ఆలయంలో అన్నప్రసాదం, ఆకుపూజ నిర్వహించారు.

మడకశిర రూరల్ : శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా మండలంలో ప్రసిద్ధి చెందిన చందకచర్ల, జిల్లేడగుంట, మాణూరు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మడకశిరటౌన్ : పట్టణ సమీపంలోని మిట్టబండ ఆంజనేయస్వామి, కావలికొండ ఆలయం, అభయాంజనేయస్వామి, వెంకటేశ్వర ఆలయాల్లో శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అగళి : శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిర రోడ్డులోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ, ఆకుపూజ, కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. శిర రోడ్డులోని ఆంనేయస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ, ఆకుపూజ, కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగళి జడ్పీటీసీ ఉమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని కొంకల్లు బీటిపల్లి, కురుబరపల్లి, హిరేతుర్పి, మందలపల్లి శనైశ్చరుడి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించి ఆకుపూజ, అభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పెనుకొండ : శ్రావణమాసం ఆఖరి శనివారంగా పట్టణంలోని ఆలయాలన్నీ కిటకిటలాడాయి. లక్ష్మీవెంకటేశ్వరస్వామి, ఊరువాకిలి ఆంజనేయస్వామి, చెరువు వద్దగల దక్షిణ ముఖ ఆంజనేయస్వామి, తదితర ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూలవిగ్రహాలను రకరకాల పూలతో అలంకరించారు. తీర్థ ప్రసాద వినియోగం గావించారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అలంకరణలో మరవ ఆంజనేయస్వామి, ఆలయం వద్ద అన్నదానం

మడకశిర(అమరాపురం) : శనేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. మండల కేంద్రంలోని శనేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి వెండికవచం ధరించి కుంకుమార్చన, పంచామృతాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు.

రొళ్ల : మండలంలోని మల్లినమడుగు గ్రామంలో వెలిసిన లక్ష్మీదేవి అమ్మవారికి శ్రావణమాస చివరి శనివారం రామజ్జగారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వివిధ రకాలపూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

పావగడలో భక్తుల సందడి

పావగడ : శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా పావగడ శనేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో హాజరై శనైశ్చరుడికి, శీతలాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని రథంపై ఊరేగించారు. భక్తులు రథోత్సవంపై అరటికాయలు, సాంబ్రాణి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారిని దాదాపు లక్ష మంది దాకా దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రధానఅర్చకులు సత్యనారాయణశాస్త్రి తెలిపారు. చిక్కనాయనహళ్లి, జేడీఎస్ ఎమ్మెల్యే సురేష్‌బాబు కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అలంకరణలో శనైశ్చరుడు, శీతలాంబ


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శేఖర్

జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

● సభ్యత్వ నమోదుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్

గోరంట్ల, ఆగస్టు 31: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండున్నర లక్షల మంది బీజేపీ సభ్యత్వం తీసుకోగా, శ్రీసత్యసాయి జిల్లాలోనే నాలుగు లక్షలమందితో సభ్యత్వ నమోదు చేయించడమే ధ్యేయమని పార్టీ జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్ పేర్కొన్నారు. శనివారం గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో ఆరేళ్లకోసారి అగ్రనాయకులతోపాటు అందరూ నూతనంగా సభ్యత్వం తీసుకోవాలన్నారు. నిర్ధేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మేదర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన తప్పనిసరి

లేపాక్షి, ఆగస్టు 31 : రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ పేర్కొన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మానెంపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కుల, మత జాతి భేదం లేకుండా అన్ని హక్కులు అందరికీ సమానంగా ఉండాలన్నారు. పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం రూరల్ సీఐ జనార్ధన్, ఎస్ఐ గోపీ, అన్నిశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంక్ ఏర్పాటు చేయాలని వినతి

మడకశిర రూరల్, ఆగస్టు 31: మండలంలోని ఆమిదాలగింది పంచాయతీ కేంద్రంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ను ఏర్పాటుచేయాలని గ్రామస్థులు మంజునాథ్ , శాంతి వీరప్ప, వెంకటాద్రి, రామప్ప అనిల్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రంజిత్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం మడకశిరరలో గ్రామీణ బ్యాంకు నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బ్యాంక్ జీఎంను కలిసి వినతి ప్రతాన్ని చేశారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని జీఎం పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి మంత్రి ఆర్థిక సాయం

పెనుకొండ రూరల్, ఆగస్టు 31: మండలంలోని శెట్టిపల్లిలో సీనియర్ టీడీపీ నాయకులు వడ్డి వెంకటరామప్ప కుటుంబానికి మంత్రి సవిత రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. వెంకటరామప్ప అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కన్వీనర్ సిద్దయ్య, సర్పంచ్ శ్రీనివాసులు, తదితర టీడీపీ నాయకులు శెట్టిపల్లి గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం సవిత ఇచ్చిన నగదును బాధిత కుటుంబానికి అందజేశారు.

మతిస్థిమితంలేని వ్యక్తి హల్‌చల్


పోలీసులు వారిస్తున్నా లెక్కచేయకుండా హంగామా చేస్తున్న వ్యక్తి

మడకశిరటౌన్, ఆగస్టు 31 : స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ చేసి పోలీసులను పరుగులు పెట్టించాడు. స్థానికులు తెలిపిన వివరాలమేరకు మండల పరిధిలోని సి.రంగాపురం గ్రామానికి చెందిన హనుమంతేగౌడ్ అనే వ్యక్తి హంగామా చేసిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఉదయమే పోలీస్‌స్టేషన్ ముందుకు వచ్చి నడిరోడ్డుపై అర్ధనగ్నంగా పిచ్చిచేష్టలు చేశాడు. ఇటీవల బెంగళూరులోని నిమాన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కాసేపు పోలీసులు వారించినా ఏమాత్రం లెక్కచేయకుండా హంగామా సృష్టించాడు. చివరకు పోలీసులు ఓ ఆటోలో ఎక్కించి గ్రామానికి పంపారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి: మంత్రి


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

చిలమత్తూరు, ఆగస్టు 31: పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తోందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సూచించారు. శనివారం ఆమె మండలంలోని టేకులోడు ఎంజేపీ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో పలు సౌకర్యాలు, భోజనాలను పరిశీలించారు. స్టాక్ రూంలోని బియ్యం నిల్వలను చూసి వాటి రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థునులతో సమస్యలపై ఆరా తీశారు. హాస్టల్ సౌకర్యాలు, బోధనా సమస్యలపై నేరుగా తనకు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. సోలార్ వాటర్ హీటర్ ఏర్పాట చేయాలని విద్యార్థులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ముందుచూపు లేని మాజీ సీఎం జగన్ బీసీ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా టీడీపీ అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు బేకరీ గంగాధర్, నందీషప్ప, ఆశ్వర్థప్ప, బయపరెడ్డి, శ్రీదేవి ఉన్నారు.

పులేరులో పౌరహక్కులపై అవగాహన


పులేరు ఎస్సీకాలనీలో మొక్క నాటుతున్న అధికారులు

గోరంట్ల, ఆగస్టు 31: మండలంలోని పులేరు గ్రామం ఎస్సీకాలనీలో రచ్చకట్టపై అధికారులు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో అంటరాని తనం, కులవివక్షతకు అవకాశం లేకుండా పౌర హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రవర్తించాలని అధికారులు కోరారు. దళితులపై వివక్ష చూపితే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎస్సీకాలనీలో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రెడ్డిశేఖర్, సీఐ శేఖర్, సర్పంచ్ ప్రభాకర్‌రావు, టీడీపీ కన్వీనర్ సోముశేఖర్, ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డి, కిషోర్‌రాయల్, హరి, హైదర్‌వలీ, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్, ఆగస్టు 31: డిప్లొమా కోర్సులకు అర్హులైనవారు దరఖాస్తులు చేసుకోవాలని గుండుమలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ , ఎలక్ట్రానిక్స్ కోర్సుల ప్రవేశం కోసం సెప్టెంబరు 1 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 45 రోజుల ఈ కోర్సుకు రూ.1500 ఫీజు చెల్లించాలన్నారు.

కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యం : ఎమ్మెల్యే

మడకశిర టౌన్, ఆగస్టు 31: కార్పొరేట్ ఆస్పత్రి స్థాయి ప్రతి పేదవాడికి వైద్యసేవలు అందాలని, వైద్యం కోసం డబ్బు వృథా కాకుండా వారికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నదే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జపానందస్వామి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, నయోనిక ఐకేర్ ఛారిటబుల్ ట్రస్టు బెంగళూరు, సిద్ధార్థ మెడికల్ కళాశాల తుమకూరు వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అమోఘం


మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

పెనుకొండ, ఆగస్టు 31 : స్థానిక శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న పర్తి యాత్రలో భాగంగా సేవలందించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవ అభినందనీయమని జిల్లా అధ్యక్షులు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శనివారం పర్తియాత్ర ముగింపు అనంతరం చిత్రావతి రోడ్డులోని హారతి ఘాట్‌దగ్గర ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సేవాభావం పురస్కరించుకుని సమాజానికి తమవంతు సాయాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్‌జయప్ప, హిందూపురం ఎన్ఎస్‌పీఆర్ ఎట రంగనాయకులు, టీమ్‌లీడర్ కుమారస్వామి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


పోలీసు అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న న్యాయాధికారి

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి

● న్యాయాధికారులు

హిందూపురం, ఆగస్టు 31 : జాతీయ మెగా లోక్ అదాలత్‌పై బాధితులకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు న్యాయాధికారులు సూచించారు. శనివారం కోర్టులో పోలీసు అధికారులతో జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్, జూనియర్ సివిల్ న్యాయాధికారి లలితాలక్ష్మీ మాట్లాడుతూ ఈనెల 14న జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగనుందని రాజీఅయ్యే కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్, అబ్దుల్ కరీం, ఏపీపీ ఇందాద్‌లు పాల్గొన్నారు.

చౌకధాన్యపు డిపోల సంఘం ఎంపిక

హిందూపురం, ఆగస్టు 31: హిందూపురం పట్టణంలోని చౌకధాన్య డిపోడీలర్ బాబురెడ్డిని చౌకధాన్యపు డిపోల సంఘం అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. శనివారం సమావేశమైన డీలర్లు నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా టీడీపీ నాయకులు నాగరాజు, అధ్యక్షునిగా బాబురెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఖాన్, రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా ఫక్రుద్దీన్, కార్యదర్శిగా రమణ, సంయుక్త కార్యదర్శిగా ఫజులుల్‌రహిమాన్, ట్రెజరర్‌గా వెంకటస్వామి, డైమండ్‌బాబా, అన్వర్, అంజి, నూరుల్లా, బుల్లెట్ జియాలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బేవనహళ్లి ఆనంద్, మంగేష్, ఎస్టీసెల్ వెంకటరమణ, కిరోసిన్‌బాబు, అంజాద్, తదితరులు పాల్గొన్నారు.


నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

మహిళ మెడలో గొలుసు అపహరణ

గోరంట్ల, ఆగస్టు 31: మండలంలోని ఎములకలగుట్లపల్లికి చెందిన శివమ్మ మెడలో బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మేరకు శనివారం రంగారెడ్డి భార్య శివమ్మ ఇంటి ముందు మధ్యాహ్నం పాత్రలు శుభ్రం చేసుకుంటుండగా, ఇద్దరు మాస్కులు ధరించిన ద్విచక్రవాహనంపై వచ్చి ఇంటిముందు ఆపారు. తహసీల్దార్ కార్యాలయంనుంచి వచ్చామని, ఆధార్, రేషన్‌కార్డు తీసుకురావాలని అడిగారు. ఉన్నఫళంగా దుండగుల్లో ఒకరు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని, సిద్ధంగా ఉన్న ద్విచక్రవాహనంలో ఎక్కి ఇద్దరూ వానవోలు గ్రామం వైపు వెళ్లినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

3న మెగా జాబ్‌మేళా

పెనుకొండ, ఆగస్టు 31 : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో ఈనెల 3న నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కేశవరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయూం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ఆరు కంపెనీలవారు పాల్గొంటున్నట్లు తెలిపారు. టెన్త్ నుంచి పీజీ పూర్తి చేసి 18-35సంవత్సరాలున్నవారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు ఉమ్మడి జిల్లాల్లో, హైదరాబాద్, బెంగళూరులో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు ఆధార్‌తో ఉదయం 9గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. కోఆర్డినేటర్ విప్రప్రసాద్ 9676706976కు సంప్రదించాలన్నారు.

బైక్ రేస్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిందూపురం/అర్బన్, ఆగస్టు 31: రోడ్లపై ఎవరైనా బైకరేస్‌లు నిర్వహించినా, వేగంగా వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మహేష్ హెచ్చరించారు. ఆగస్టు 27వ తేదీ ఆంధ్రజ్యోతి లో ప్రచురితమైన 'మితిమీరిన ఆకతాయిల ఆగడాలు' కథనంపై డీఎస్పీ స్పందించారు. ఆయన ఆదేశాలతో కొంత మంది బైక్ రేస్ చేసే యువకులను గుర్తించి శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. బైక్‌లపై విన్యాసాలు, సైలెన్సర్‌ను తొలగించి డ్రైవింగ్ చేయడం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు ఆర్థిక సాయం

పెనుకొండ, ఆగస్టు 31 : పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో పల్లె ఉమ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ జూనియర్‌కళాశాల విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. శనివారం సత్యసాయి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన పేద విద్యార్థులైన ఆఫ్రీన్, సంతోష్, నవదీప్‌కు ఆర్థిక సాయాన్ని చేసి వారికి ఉన్నత విద్య అభ్యాసానికి బాసటగా నిలిచారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించాలని వారిని ప్రోత్సహించడానికి ఈ ఆర్థిక సాయం అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలుడికి డెంగీ

● చికిత్స నిమిత్తం తుమకూరుకు తరలింపు
● గ్రామంలో అపరిశుభ్రతపై స్థానికుల ఆగ్రహం

అగళి, ఆగస్టు 31 : మండలంలోని ఇనగలూరు ఎస్సీ కాలనీలో బాలుడికి డెంగీ నిర్ధారణ అయ్యింది. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన 11 సంవత్సరాల బాలుడు విజయ్ అస్వస్థతకు గురి కావడంతో స్థానిక చిన్నపిల్లల ఆస్పత్రిలో చూయించారు. అయితే బాలుడికి డెంగీ సోకిందని తుమకూరుకు తరలించాలని వైద్యులు సూచించారు. తల్లిదండ్రులు బాలుడిని బెంగళూరులోని ఓప్రైవైట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే వారం రోజులుగా గ్రామంలో పైపులైన్లు లీకేజీ కావడంతో మురికి నీరు రోడ్డుపైనే పారుతోందని టీడీపీనాయకుడు క్యాతప్ప తెలిపారు. తాగు నీరు కలుషితం కావడంతో గ్రామంలో రోగాలు ప్రబలుతున్నాయని, తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


తుమకూరులో చికిత్స పొందుతున్న విజయ్

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

చిలమత్తూరు, ఆగస్టు 31: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత పేర్కొన్నారు. శనివారం ఆమె చిన్నప్పరెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగాధర్, వెకంటసుబ్బయ్య, కిష్టప్ప, అంగణవాడీ కార్యకర్తలు పద్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.